క్లుప్తంగా

ఉరుసు మహోత్సవాలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లిలో ప్రసిద్ధి గాంచిన హజ్రత్ సయ్యద్ షాబూఖారీ బాబా 426వ ఉరుసు మహోత్సవాలకు హాజరు కావాలని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌కు ఆయన నివాసంలో సూఫీ మతగురువు మహ్మద్ అల్తాఫ్‌రజా మంగళవారం ఆహ్వాన పత్రం అందజేశారు. ఈ నెల 31, ఫిబ్రవరి 1, 2 తేదీల్లో మూడు రోజుల పాటు ఉరుసు మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాహెద్ పాల్గొన్నారు.

స్టడీమెటీరియల్ ఆవిష్కరణ

ఇబ్రహీంపట్నం: డెమొక్రటిక్ పీఆర్టీయూ ఆధ్వర్యంలో జి.కొండూరు, కంచికచర్ల, వీరులపాడు, ఇబ్రహీంపట్నం మండలాల ప్రాంతీయ సమావేశం స్థానిక జెడ్పీ పాఠశాలలో మంగళవారం జరిగింది. టెన్త్‌క్లాస్ విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచేందుకు యూనియన్ సేవాదళ్ అధ్యక్షుడు డి.శ్రీను ఆధ్వర్యంలో రూపుదిద్దుకున్న టెన్త్‌క్లాస్ మోడల్ పేపర్స్, స్టడీమెటీరియల్‌ను ఆవిష్కరించారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు పంపిణీ చేశారు. విద్యా సామాజిక సేవా కార్యక్రమాలకు చేయూత ఇస్తున్న ఉపాధ్యాయులకు డి.శ్రీను కృతజ్ఞతలు తెలిపారు. మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆదిలక్ష్మి, ఇర్ఫాన్ పాషా, జిల్లా అధ్యక్షుడు జమలయ్య, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ పాల్గొన్నారు.

సరిహద్దు రాళ్ల సరఫరా

గంపలగూడెం: జగనన్న శాశ్వత భూ హక్కు పథకంలో భాగంగా ప్రభుత్వ, ప్రైవేటు భూములకు సంబంధించి సరిహద్దులు ఏర్పాటు కోసం అవసరమైన 1120 సరిహద్దు రాళ్లను ఉన్నతాధికారులు గంపలగూడెం మండలానికి సరఫరా చేశారు. పథకం మొదటి విడత గ్రామాలలో ఒకటిగా ఉన్న గంపలగూడెంలో భూరీసర్వే పూర్తి చేశారు. దీంతో ప్రభుత్వ, ప్రైవేటు భూములకు సరిహద్దు రాళ్లను ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రభుత్వ భూములకు సంబంధించి 390, రైతుల భూములకు సంబంధించి మొదటి విడతగా 730 రాళ్లను అధికారులు సరఫరా చేసినట్లు తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి తెలిపారు. వీటిని స్థానిక తహసీల్దార్ కార్యాలయం పక్కనున్న ఖాళీ స్థలంలో నిల్వ చేసినట్లు పేర్కొన్నారు. త్వరలో వీటిని ప్రతి ఎల్‌పీఎంకు సంబంధించి రెండు రాళ్లను హద్దుగా ఏర్పాటుచేయడం జరుగుతుందన్నారు.

అభివృద్ధి ప్రదాత డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి

వెల్వడం(మైలవరం): విద్యా ప్రదాత డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి సేవలు ప్రశంసనీయమని వైఎస్సార్ సీపీ వెల్వడం గ్రామ కన్వీనర్ యరమల రాంభూపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మైలవరం మండలం వెల్వడం గ్రామానికి చెందిన ప్రవాసాంధ్రులు డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి గత రాత్రి స్వదేశం వచ్చిన సందర్భంగా విమానాశ్రయంలో ఆయనకు స్వాగతం పలికారు. ఆయన్ను వైఎస్సార్ సీపీ నాయకులు కలిశారు. వెల్వడం సర్పంచ్ పీ ధర్మరాజు, ఎంపీటీసీ సభ్యుడు ఉదయ్ భాస్కర్‌రెడ్డి, వార్డు సభ్యుడు కృష్ణారెడ్డి, కోటేష్, గోపాల్, శీలం కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మామిడిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

తిరువూరు: మామిడి పూతకు తామర పురుగు ఆశించినందున సస్యరక్షణ చర్యలు చేపట్టాలని తిరువూరు ఉద్యానవన అధికారి సోహైల్ అహ్మద్ రైతులకు సూచించారు. మండలంలోని లక్ష్మీపురం, మల్లేల, రామన్నపాలెం గ్రామాల్లో తోటబడి కార్యక్రమంలో భాగంగా రైతులతో కలిసి మామిడి తోటలను మంగళవారం పరిశీలించారు. పూత, పిందె దశలలోని మామిడిపంటకు తామర పురుగు నష్టం చేకూర్చే అవకాశం ఉందన్నారు. ఈ తెగులుతో మంగు వ్యాపించి కాయలు కుళ్లిపోతాయని తెలిపారు. ఈ తెగులు నివారణకు థయోమిథాక్సామ్ మందును లేదా ఫిప్రోనిల్‌ను వేపనూనెతో కలిపి పిచికారీ చేయాలని సూచించారు.

ఓటుహక్కు ఆవశ్యకతపై వ్యాసరచన పోటీలు

తిరువూరు: జాతీయ ఓటరు దినోత్సవ సందర్భంగా తిరువూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు 'ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటుహక్కు ఆవశ్యకత' పై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటుహక్కు పొందాలని, ఎన్నికలలో తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ మురళీకృష్ణ సూచించారు. వ్యాసరచన పోటీల్లో విజేతలకు బుధవారం బహుమతులు అందజేయనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

ఆర్‌బీకేలో రికార్డుల తనిఖీ

కె.తాడేపల్లి(విజయవాడరూరల్): కొత్తూరు తాడేపల్లి గ్రామం రైతుభరోసా కేంద్రంలో రికార్డులను రేంజ్ విజిలెన్స్ అధికారి ఎం.పరమేశులు మంగళవారం పరిశీలించారు. రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆదేశాల మేరకు ఆయన రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఎరువుల నిల్వచేసిన గోదామును పరిశీలించారు. తనిఖీల్లో పీసీ లక్ష్మణ్, వ్యవసాయాధికారి రంగనాథ్, పీఏసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన

ఎమ్మెల్యే రక్షణనిధి



తెల్లదేవరపల్లిలో సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

తెల్లదేవరపల్లి(విస్సన్నపేట): రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన కొనసాగుతుందని ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి పేర్కొన్నారు. మండలంలోని తెల్లదేవరపల్లి సచివాలయం పరిధిలో ఎస్సీ కాలనీలో గడప గడపకూ మనప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటి వరకు అందజేసిన సంక్షేమ పథకాలను ఎమ్మెల్యే వివరిస్తూ ఆయా లబ్ధిదారులకు బ్రోచర్లు పంపిణీ చేశారు. తెల్లదేవరపల్లి గ్రామంలో రూ.14 కోట్లతో సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అలాగే సచివాలయానికి ఇచ్చే రూ.20 లక్షలతో అవసరమైన ప్రాంతాల్లో సీసీ రోడ్లు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. తమది మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వం అని, పార్టీలకతీతంగా అమలు అవుతున్న అనేక సంక్షేమ పథకాలే నిదర్శనం అని ఎమ్మెల్యే తెలిపారు. రైతుల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేయడంతో పాటు పేద విద్యార్థులకు ఉన్నత విద్యలు చదివేందుకు అనేక పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్.వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి, ఏఎంసీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు గంటల నాగాచారి, ఎంపీటీసీ చాట్ల మణి, మాజీ వైస్ ఎంపీపీ ఓలేటి దుర్గారావు, కేడీఈసీసీబీ డైరెక్టర్ భూక్యా రాణి, వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యుడు సిరసాని ప్రకాష్, విస్సన్నపేట ఉపసర్పంచ్ సత్యనారాయణరెడ్డి, పుట్రేల మాజీ సర్పంచ్ ఎల్ వెంకటరత్నం, పిల్లి రాజేష్ పాల్గొన్నారు.

పేదల పక్షపాతి ముఖ్యమంత్రి వైఎస్ జగన్

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

ఆగిరిపల్లి: పేదల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. మండలంలోని నెక్కలం గొల్లగూడెంలో నాలుగో రోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గడప గడపకూ తిరిగి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు సంబంధించిన బ్రోచర్లను లబ్ధిదారులకు అందిస్తూ వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా పేదలు ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలు ప్రవేశ పెట్టారన్నారు. ఈ సంక్షేమ పథకాలు కొనసాగాలంటే సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతునివ్వాలని ప్రజలను కోరారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పల్లగాని నరసింహారావు, మండల ఇన్‌చార్జి మచ్చా హరిబాబు, సర్పంచ్ లింగవరపు రమేష్, ఎంపీటీసీ సభ్యుడు గుర్రం శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు పిన్నిబోయిన వీరబాబు, గ్రామ పార్టీ అధ్యక్షుడు పటాపంచల గోపాలరావు, నాయకులు నెక్కళపు కృష్ణ, గూండ్ల హనుమంతరావు, గజగంటి శ్రీనివాసరావు, పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకట ప్రతాప్ అప్పారావు

అంకిత భావంతో పని చేయాలి



ఎమ్మెల్యే వెంకట కృష్ణప్రసాద్, పడమటి సురేష్‌బాబును కలిసిన మండల కో–ఆర్డినేటర్లు

మైలవరం: నూతనంగా ఎన్నుకున్న సచివాలయాల కన్వీనర్ల మండల కో–ఆర్డినేటర్లు అంకిత భావంతో పనిచేసి వైఎస్సార్ సీపీని ప్రజలకు మరింత చేరువ చేయాలని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమాభివృద్ధి పాలన ఫలాలు గురించి విస్తృతంగా ప్రచారం చేయాలని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. సచివాలయాల కన్వీనర్ల మండల కో–ఆర్డినేటర్లు మంగళవారం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ స్వగ్రామం ఐతవరంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కార్యాలయం మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. మనమంతా జగనన్న సైనికులమేనని, ప్రజలకు మంచి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోసం అంకిత భావంతో పనిచేసి పార్టీకీ, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని పేర్కొంది. సచివాలయాల కన్వీనర్ల మండల కో–ఆర్డినేటర్లుగా కోసూరు వెంకటేష్–ఇబ్రహీంపట్నం రూరల్, లంకె అంక మోహనరావు–కొండపల్లి మున్సిపాలిటీ, గేరా సుమన్–విజయావాడ రూరల్, కాజా బ్రహ్మయ్య–జి.కొండూరు, చామల సీతారామిరెడ్డి–మైలవరం, ఉయ్యూరు భరత్‌కుమార్‌రెడ్డి–రెడ్డిగూడెం ఎన్నికయ్యారు. వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ పరిశీలకులు పడమటి సురేష్‌బాబును కూడా కోఆర్డినేటర్లు కలిశారు.

37మందికి ఆధార్ నమోదు

గంపలగూడెం: మండలంలోని రెండు గ్రామాల్లో మంగళవారం ఆధార్ ప్రత్యేక క్యాంప్‌లను నిర్వహించారు. తునికిపాడు సచివాలయం, తోటమూల సరస్వతీ విద్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక క్యాంపుల్లో డిజిటల్ సహాయకులు విజయ్, ప్రసాద్‌లు 37మందికి ఆధార్ నమోదు చేశారు. ఎంపీడీఓ పిచ్చిరెడ్డి పర్యవేక్షించారు.

తహసీల్దార్‌కు అవార్డు

మైలవరం: తహసీల్దార్ ముత్యాల శ్రీనివాస్ బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీసెస్ అవార్డుకు ఎంపికయ్యారు. శ్రీనివాస్ అసిస్టెంట్ ఎలక్టోరల్ ఆఫీసర్ 82–మైలవరం అసెంబ్లీ నియోజకవర్గం తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈ నెల 25న విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో అవార్డును తహసీల్దార్‌కు అందజేయనున్నట్లు ఏపీ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ కార్యాలయం మంగళవారం ప్రకటన విడుదల చేసింది.

ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం



కొండపల్లిలో కరాటే ప్రదర్శిస్తున్న బాలికలు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి క్రాంతి కాన్వెంట్‌లో జాతీయ బాలికా దినోత్సవ కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్వీయ రక్షణ కోసం బాలికలు నేర్చుకున్న కరాటే విద్య ప్రదర్శించి ఆకట్టుకున్నారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆడపిల్లలను పుట్టనిద్దాం, ఎదగనిద్దాం, చదవనిద్దాం నినాదంతో పుస్తకాలు ఆవిష్కరించారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు వెనిగళ్ల మురళీమోహన్, డాక్టర్ మామిడి సీతారామారావు పాల్గొన్నారు. మూలపాడు ఎంపీపీ పాఠశాలలో మహిళా సంరక్షణ అధికారి పి.అనూష బాలికలకు ఆత్మస్వీయ రక్షణ, బాలల హక్కులు, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. హెచ్‌ఎం విజయలక్ష్మి, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

బాలికల సంరక్షణకు కృషి

మైలవరం: బాలికల సంరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు పేర్కొన్నారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్, ఇంటర్నల్ కంప్లయన్స్ కమిటీ, సహేలీ ద గరల్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా బేటీ బచావో– బేటీ పడావో కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఐసీసీ ప్రిసైడింగ్ ఆఫీసర్ శోభారాణి మాట్లాడుతూ బాలికలు, స్త్రీలు నూతన పరిచయాలతో జాగ్రత్తగా ఉండాలన్నారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: సమాజంలో అసమానతలు తొలగించేందుకు, సామాజిక సమతుల్యతకు బాలికలను రక్షించుకోవడం మనందరి బాధ్యతని ఎంపీపీ పాలడుగు జోత్స్న అన్నారు. ఇబ్రహీంపట్నం జెడ్పీ పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జరిగిన జాతీయ బాలికా దినోత్సవంలో ఆమె పాల్గొన్నారు. 'ఎదిగే ఆడపిల్లలు ఏం తెలుసుకోవాలి' పుస్తకం ఆవిష్కరించారు. జేవీవీ జిల్లా ఉపాధ్యక్షుడు పి.కామేశ్వరరావు పాల్గొన్నారు. తుమ్మలపాలెంలో ఎంపీపీ పాఠశాలలో నిర్వహించిన బాలికాదినోత్సవంలో సర్పంచ్ బొమ్ము వెంకటరమణ, సూపర్ వైజర్ రమాదేవి పాల్గొన్నారు.

తిరువూరులో..

తిరువూరు: మునుకుళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు బాలికల దినోత్సవంపై అవగాహన కల్పిస్తూ ప్లకార్డులు, పోస్టర్లతో గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు. తిరువూరు ఐడియాస్ సేవా సంస్థ, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మల్లేల జెడ్పీహెచ్ఎస్, తిరువూరు రాజుపేట, ఎర్రమాడు ఎంపీయూపీ స్కూళ్లలో బాలికల హక్కులను వివరిస్తూ సమావేశాలు నిర్వహించారు.

విస్సన్నపేటలో..

విస్సన్నపేట: స్థానిక సెయింట్‌థెరిస్సా పాఠశాల్లో జాతీయ బాలికా దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాలికలకు పలు అంశాలపై అవగాహన కల్పించి, ప్రతిజ్ఞ చేయించారు.

కిడ్నీ వ్యాధుల నివారణపై అవగాహన

ఎ.కొండూరు: మండలంలోని కిడ్నీ వ్యాధుల ప్రభావిత గ్రామాల్లో కళాజాత బృందం వారిచే అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి దివిజ మంగళవారం తెలిపారు. మండలంలోని వెంకటతండా, చైతన్యనగర్ తండాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి కిడ్నీ వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

దివ్యాంగ బాలలను ఆదరించాలి

ముసునూరు: దివ్యాంగ బాలలను అందరూ ఆదరించి, అక్కున చేర్చుకోవాలని హెచ్‌ఎం హన్నామణి అన్నారు. సమగ్ర శిక్షా అభియాన్ ముసునూరు విభాగం ఆధ్వర్యంలో దివ్యాంగ బాలల తల్లిదండ్రులకు మెయిన్ ప్రాథమిక పాఠశాల భవిత కేంద్రంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం ఫిజియో థెరపిస్ట్ ప్రశాంతి ఐదుగురు దివ్యాంగ బాలలకు ఫిజియో అభ్యసనాలు నిర్వహించారు.

అశ్వవాహనంపై విహరించిన శోభనాచలేశుడు

ఆగిరిపల్లి: శోభనాచల వ్యాఘ్రలక్ష్మీ నరసింహస్వామి మాఘమాస రథసప్తమి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి అశ్వ వాహనంపై ఊరేగారు. ఉదయం స్వామి కల్యాణ మండపంలో శాంతి కల్యాణాన్ని నగర సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. రాత్రి గ్రామ యాదవ సంఘం ఆధ్వర్యంలో స్వామిని పెళ్లికుమారుడిగా అలంకరించి అశ్వ వాహనంపై గ్రామోత్సవం జరిపించారు. ఆలయ ఈఓ భవాని పర్యవేక్షించారు.

రైల్వే లైన్ వద్దంటూ అడ్డుకున్న రైతులు

మైలవరం: మైలవరం మీదుగా కొత్తగా రైల్వే లైన్ వేసేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకునే చర్యల వలన సాగు భూములను కోల్పోతారని, వెంటనే రైల్వే లైన్ ఏర్పాటును నిలుపుదల చేయాలని బాధితులు గోగులమూడి సాంబశివారెడ్డి, కే. సుందరరావు, పీరాం బాబురెడ్డి మరి కొంతమంది రైతులు మరోసారి రైల్వే అధికారులను మంగళవారం అడ్డుకున్నారు. కొండపల్లి నుంచి కొత్తగూడెం రైల్వేలైన్ ఏర్పాటుకు కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సాయిల్ టెస్టింగ్ కార్యక్రమాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కొన్ని నెలలుగా నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో తమ అభీష్టానికి వ్యతిరేకంగా సర్వే పనులు నిర్వహిస్తే ఆత్మహత్యలు చేసుకోవడం తప్ప తమకు వేరే మార్గం లేదని స్పష్టం చేయడంతో అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

వ్యాసరచన పోటీల్లో ద్వితీయ స్థానం

తోటమూల(గంపలగూడెం): బాలిక దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గంపలగూడెం మండల పెద్దకొమిర ఆదర్శ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని కొమ్ము లక్ష్య సుహానా ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈనెల 21వ తేదీన విజయవాడ బిషప్ హాజరయ్య స్కూల్లో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. బాలికలను రక్షించండి అనే విషయమై రాసిన వ్యాసరచన పోటీలో ఈ బాలికల ద్వితీయ స్థానంలో మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ ఆర్ శైలజ తెలిపారు. మంగళవారం విజయవాడ సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో బాలికకు జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు మెడల్, ప్రశంసాపత్రం, రూ. 5వేల బహుమతి అందజేశారు.

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టం పొడిగింపు హర్షణీయం

రెడ్డిగూడెం: ఎస్సీ, ఎస్టీసబ్ ప్లాన్‌ను రాష్ట్ర ప్రభుత్వం మరో 10 సంవత్సరాలు పొడిగించడంపై వైస్ ఎంపీపీ చాట్ల రాబర్టు హర్షం వ్యక్తం చేశారు. రెడ్డిగూడెంలో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ ద్వారా దళిత, గిరిజనులకు ఆర్థికంగా సామాజికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం మరో పదేళ్లపాటు పొడిగిస్తూ తీసుకొచ్చిన జీఓను స్వాగతిస్తున్నామన్నారు.

పోటీల్లో పాల్గొని సృజనాత్మక శక్తి పెంపొందించుకోవచ్చు

మైలవరం: విద్యార్థులు కళాశాలలో నిర్వహిస్తున్న పోటీల్లో పాల్గొనడం వలన సృజనాత్మక శక్తిని పెంపొందించుకోవచ్చని ఈఈఈ విభాగాధిపతి డాక్టర్ జే శివవర ప్రసాద్ తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల(ఎల్బీఆర్సీఈ)లో ఈఈఈ విభాగంలో బోర్డు ఆఫ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ త్రూ ఎడ్యుకేషన్, ఆంధ్రప్రదేశ్, లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ప్రకృతి క్లబ్, ఏఐసీటీఈ–ఎస్‌పీఐసీఈఎస్ ఆధ్వర్యంలో ఎనర్జీ కన్జర్వేషన్ అనే అంశంపై పేపర్, పోస్టర్ ప్రజంటేషన్‌పై మంగళవానం విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. కార్యక్రమ కో–ఆర్డినేటర్‌గా ఆర్.పద్మ వ్యవహరించారు. ప్రకృతి క్లబ్ కో–ఆర్డినేటర్లు డాక్టర్ షహీదా నిలోఫర్, డాక్టర్ వి.భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా మెలగాలి

గంపలగూడెం: బాలికలు అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా మెలగాలని గంపలగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం జమలయ్య తెలిపారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పట్టణ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో బాలికల దినోత్సవ సందర్భంగా 8, 9, 10 తరగతుల బాలికలకు బాలిక వేధింపులు, చట్టాలు, పౌష్టికాహారం తదితర అంశాలపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ పాఠశాలకు రాకపోకలు సాగించే సమయంలో మార్గమధ్యంలో ఎవరైనా వేధింపులకు గురి చేస్తుంటే వెంటనే పోలీసులకు, ఉపాధ్యాయులకు, అంగన్‌వాడీ సిబ్బందికి తెలియజేయాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మునిలక్ష్మి మాట్లాడుతూ బాలిక వేధింపులకు పాల్పడిన వారిపై చట్ట ప్రకారం తీసుకునే చర్యలను వివరించారు. హైస్కూలు బాలికలు రోజూ తగిన పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనతకు గురి కాకుండా చూసుకోవాలన్నారు.

భోజన పథకాన్ని సక్రమంగా అమలు చేయాలి

జెడ్పీటీసీ సభ్యుడు శామ్యూల్



తునికిపాడు హైస్కూల్లో భోజన పథకం అమలు తీరును పరిశీలిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు శామ్యూల్

తునికిపాడు(గంపలగూడెం): ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని సక్రమంగా అమలు చేయాలని గంపలగూడెం జెడ్పీటీసీ సభ్యుడు కోట శామ్యూల్ తెలిపారు. తునికిపాడు జెడ్పీ ఉన్నతపాఠశాల, మండల పరిషత్ ఎలిమెంటరీ పాఠశాలల్లో మధ్యాహ్నభోజనాన్ని ఆయన మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పౌష్టికాహారం అందేలా చూడాలని హెచ్‌ఎంకు తెలిపారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, సర్పంచ్ మాధవి, పీఎంసీ చైర్మన్ రాజీవ్‌గాంధీ, రవి, హెచ్‌ఎం రామచంద్రరావు పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణపై రైతులు అప్రమత్తంగా ఉండాలి

చాట్రాయి: మామిడికి సోకే తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన కలగాలని మామిడి పరిశోధన కేంద్రం శాస్త్రవేత కె.రాధారాణి తెలిపారు. మంగళవారం చాట్రాయి ఆర్‌బీకేలో నిర్వహించిన మామిడి సాగులో పూత పిందె దశలో తీసుకోవాల్సిన జాగ్రతలపై రైతులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంచు తెగులు నివారణకు 2 మిల్లీలీటర్ల హెక్సాకోనాజోల్ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. మంచు పురుగు నివారణకు 0.5 ఇమిడాక్లోప్రిడ్ ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని చెప్పారు. ఏపీ కో ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి మాట్లాడుతూ రైతుల సంక్షేమ కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఏడీఏ శాంతి, మండల ఉద్యానవన శాఖాధికారి హేమ పాల్గొన్నారు.

సమస్య పరిష్కారంపై హర్షం

ముసునూరు: పలు సంవత్సరాలుగా పరిష్కారానికి నోచుకోని సమస్య గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పరిష్కారం లభించడంతో ఆ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని గుళ్లపూడి గ్రామ శివారు గుడిపాడు మొండివాగు ప్రాంతంలో సుమారు 200 నివాసాలు ఉన్నాయి. వీధి లైట్లు వేయించాలని గతంలో అధికారులకు ఆ ప్రాంత వాసులు మొర పెట్టుకుంటూ వినతిపత్రాలు అందజేశారు. వారి సమస్య పరిష్కారం కాలేదు. ఇటీవల ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించిన సమయంలో స్థానికులు తమ సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే అప్పటికప్పుడే విద్యుత్ శాఖాధికారులతో చర్చించి, మొండి వాగు ప్రాంతంలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని సూచించారు. చకచకా చర్యలు చేపట్టిన అధికారులు స్తంభాలను ఆ ప్రాంతానికి తరలించారు. దీంతో 22 స్తంభాలకు వీధి లైట్లు వేసే ప్రక్రియను మంగళవారం సర్పంచ్, ఉప సర్పంచ్‌లు ఆర్.శ్రీదేవి శ్రీనివాస్, వి.వల్లీ పద్మజ రాంబాబు టెంకాయ కొట్టి ప్రారంభించారు. వైస్సార్ సీపీ మండల కమిటీ సభ్యుడు వేమూరి సురేష్, గ్రామ పార్టీ అధ్యక్ష కార్యదర్శులు వి.శ్రీకృష్ణ, బి.నాగరాజు, బొల్లిన నాగమణి, కొల్లి సాంబశివరావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

లంక భూములను పరిశీలించిన జేసీ, సబ్ కలెక్టర్

ఇబ్రహీంపట్నం: లంక భూములకు ప్రభుత్వం పట్టాలు మంజూరు చేసేందుకు విడుదల చేసిన జీఓ 799 అనుసరించి జాయింట్ కలెక్టర్ నుపూర్ అజయ్ కుమార్, జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ పలు గ్రామాల్లో లంక భూములను మంగళవారం పరిశీలించారు. మండలంలోని ఇబ్రహీంపట్నం, జూపూడి, త్రిలోచనాపురం, కొటికలపూడి మూలపాడు గ్రామాల్లో సీ క్యాటగిరీలో ఉన్న భూములను ఏ,బీ క్యాటగిరీకి మార్చేందుకు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం కంచికచర్ల మండలంలోని లంక భూములు పరిశీలించేదుకు వెళ్లారు. వారి వెంట తహసీల్దార్ ఎం.సూర్యారావు, నీటి పారుదల శాఖ అధికారులు ఉన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

విస్సన్నపేట: విస్సన్నపేట, రెడ్డిగూడెం మండలంలో పలు ఎరువులు, పురుగుమందుల దుకాణాలను మైలవరం వ్యవసాయ శాఖ ఏడీ శ్రీనివాస్, విస్సన్నపేట ఏఓ రాజ్యలక్ష్మి మంగళవారం తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్, బిల్‌బుక్స్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ డీలర్లు లైసెన్స్ ఫామ్స్‌లో జతపరిచిన ఎరువులు, పురుగు మందులు మాత్రమే విక్రయించాలన్నారు. పలు దుకాణాల్లో స్టాప్‌సేల్ ఇచ్చినట్లు ఏడీ పేర్కొన్నారు.

విద్యార్థి దశ నుంచే రోడ్డు భద్రతపై అవగాహన

నూజివీడు: విద్యార్థి దశ నుంచే రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలు తదితర వాటిపై అవగాహన ఉండాలని డీఎస్పీ అశోక్‌కుమార్‌గౌడ్ అన్నారు. 34వ రహదారి భద్రతా వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని మంగళవారం పట్టణంలోని బేతస్థ ఇంటిగ్రేటెడ్ స్కూల్లో నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు తోలకూడదన్నారు. హెల్మెట్ పెట్టుకోవడం, సీటు బెల్టు ధరించడం వంటివి పాటించాలన్నారు. నూజివీడు పట్టణ, రూరల్ సీఐలు ఏవీవీఎస్ఎన్ మూర్తి, ఆర్.అంకబాబు, బ్రేక్ ఇన్‌స్పెక్టర్లు నాగ మురళీ, ప్రసాద్, రూరల్ ఎస్సై తలారి రామకృష్ణ, ట్రాఫిక్ ఎస్సై శాగం రాధాకృష్ణారెడ్డి, బేతస్థ ఇంటిగ్రేటెడ్ స్కూల్ కరస్పాండెంట్ బండి మెలోడి పాల్గొన్నారు.

'పట్టాభి నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడు'

ఆగిరిపల్లి: టీడీపీ అధికార ప్రతినిధి పట్టాభి నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పల్లగాని నరసింహారావు, వైస్ ఎంపీపీ గడ్డం సాంబశివరావు అన్నారు. ఇటీవల మండలంలోని ఈదులగూడెంలో నిర్వహించిన టీడీపీ కార్యక్రమంలో ఎమ్మెల్యే తనయుడిపై అనుచిత వాఖ్యలు చేయడాన్ని వారు ఖండించారు. గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలను అడ్డుపెట్టుకుని రేషన్ కార్డుకు ఒక రేటు, పింఛన్ కావాలంటే ఒక రేటు తీసుకున్న ఘనత మీదన్నారు. ఈ రోజు అవినీతి గురించి దెయ్యాలు వేదాలు వల్లించినట్లు పట్టాభి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ముందు ఎమ్మెల్యే తనయుడి గురించి తెలుసుకుని మాట్లాడాలని ఎవరో చెప్పిన స్క్రిప్టుతో అవాకులు చెవాకులు పేలితే పరిణామాలు వేరుగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో కలటూరు సర్పంచ్ రాఘవరపు సురేష్ పాల్గొన్నారు.

వైఎస్సార్ విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ

ఆగిరిపల్లి: మండలంలోని ఈదులగూడెంలో డిప్ సెంటర్‌లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు మంగళవారం పీఏసీఎస్ చైర్‌పర్సన్ ఈలప్రోలు వెంకట సుబ్బయ్య భూమి పూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాలుగు రోజుల్లో విగ్రహ ఏర్పాటు పనులు పూర్తి చేసి ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు చేతుల మీదుగా వేలాది మంది సమక్షంలో విగ్రహాన్ని ఆవిష్కరిస్తామని తెలిపారు. గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ఆరేపల్లి రామకృష్ణ, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ నండూరి భాస్కర్ ప్రసాద్, గ్రామ పార్టీ ఉపాధ్యక్షుడు పెనుముచ్చు రాంబాబు, యాదవ సంఘం అధ్యక్షుడు తేళ్ల గంగాధరరావు, పాల కేంద్రం అధ్యక్షుడు పెద్ది ప్రతాప్, నాయకులు కందుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు గొల్లపల్లి విద్యార్థులు

నూజివీడు: మండలంలోని గొల్లపల్లిలోని హైస్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం పాట్లూరి రాధికా రాణి మంగళవారం తెలిపారు. జూనియర్ విభాగంలో పల్లగాని ఈశ్వరి, చిన్నంశెట్టి గుణశ్రీ, మట్టా రాజేష్, సీనియర్ విభాగంలో గండికోట వాసవీ, గోపు విజయ్‌కుమార్, పల్లగాని రోహిత్‌లు ఎంపికైనట్లు పేర్కొన్నారు. వీరు ఈ నెల 27నుంచి 29వ తేదీ వరకూ కర్నూల్లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వీరిని హెచ్‌ఎంతో పాటు పేరంట్స్ కమిటీ చైర్మన్ పల్లగాని వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

పశువులకు వైద్యపరీక్షలు

చాట్రాయి: పశువులకు సోకే వ్యాధులను అరికట్టాలని మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పుచ్చకాయల సుబ్బారెడ్డి తెలిపారు. మండలంలోని నరసింహారావు పాలెంలో మంగళవారం పశువైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. సర్పంచ్ విస్సంపల్లి ప్రశాంతి, ఉప సర్పంచ్ రఘుపతిరెడ్డి, గ్రామ వైఎస్సార్ సీపీ కన్వీనర్ విస్సంపల్లి సీతయ్య, వైద్యులు శశివర్మ, లక్ష్మణ్ నాయక్ పాల్గొన్నారు.

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

ఎ.కొండూరు: ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం ఆర్.సత్యం పేర్కొన్నారు. చైతన్య మండల మహిళ సమైక్య కార్యాలయంలో మంగళవారం వీఓఏలకు సమావేశం నిర్వహించారు. ఏపీఎం మాట్లాడుతూ డ్వాక్రా గ్రూపు మహిళలు బ్యాంకుల్లో తీసుకుంటున్న లింకేజీ రుణాలతో వ్యాపారాలు చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు.

'జగనన్న తోడు'కు దరఖాస్తులు చేయించాలి

ముసునూరు: జగనన్న తోడు రుణాలకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించి, బ్యాంకులకు పంపాలని వెలుగు ఏపీఎం డి.రాజశేఖర్ సూచించారు. మండలంలోని గోపవరం వీఓఏలతో మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో సీసీ కోటేశ్వరరావు, వీఓఏలు పాల్గొన్నారు.